


**వనం నాగయ్య, కెరటం న్యూస్**

రాష్ట్ర మంత్రులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ పాలేరు సభ వేదికగా చేసిన ఆరోపణలు ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. కేటీఆర్ వ్యాఖ్య లపై ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారా యణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లా డుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు, ఓ కేటీఆర్... పాడిందే పాడరా.. పాచిపండ్ల దాసరా అన్నట్టు అవే అబద్ధాలను పదే పదే చెబితే నిజాలు మారవు, అంటూ మండిపడ్డారు. తెలంగాణ యాసలో మాట్లా డితే పదేళ్ల మీ అవినీతి, అక్రమాలను ప్రజలు మరిచిపోతారని భావించడం భ్రమేనని స్పష్టం చేశారు. మట్టి గుట్టలకు, రోడ్లకు రైతుబంధు నిధులు మళ్లించింది మీరు కాదా? అమెరికాలోని ప్రవాస భారతీయుల వందల ఎకరాల భూములకు రైతుబంధు చెల్లించింది మీ ప్రభుత్వమే కాదా? అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రశ్నల వర్షం కురిపించారు. స్కీముల పేరుతో స్కాములు చేసి లక్షల కోట్ల ప్రజాధనా న్ని కొల్లగొట్టిందీ, ధరణి పేరుతో వేల ఎకరాల భూములపై దందాలు నడిపిందీ బీఆర్ఎస్ పాలనేనని ఆరోపించారు. మాటల గారడీలో పీహెచ్‌డీ చేసి ఉండొచ్చు... కానీ ప్రజల జ్ఞాపకశక్తిని తక్కువ అంచనా వేయొద్దు నాయనా, అంటూ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఆర్థిక విధ్వంసానికి ప్రతీకగా నిలిచిందని, ఆ పాపాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ముగ్గురు మంత్రులు జిల్లాలో ప్రజల మధ్య తిరుగుతూ నిరంతరం సమస్యలు పరిష్కరిస్తున్న నాయకులని సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ప్రజాదర్బార్ల ద్వారా వేలాది సమస్యలకు పరిష్కారం చూపుతున్నారని, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్న సేవాభావాన్ని చూసి ఓర్వలేకే కేటీఆర్ విషప్రచారం చేస్తున్నారని అన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రతి పల్లెలో జరుగుతున్న అభివృద్ధి పనులే కేటీఆర్ విమర్శలకు సమాధానమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందనే కలలు రాత్రిళ్లు నిద్రపోయేటప్పుడు మాత్రమే కనండి నాయనా... తెలంగాణ ప్రజలు ఇప్పటికే మీకు తీర్పు చెప్పారు, అంటూ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ అడ్డుపెట్టి రాజకీయం చేయాలన్న కేటీఆర్ ఆశలు ఎప్పటికీ నెరవేరవని స్పష్టం చేశారు. మా త్రిమూర్తుల ఇలాఖా అయిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వచ్చి అడ్డగోలు ప్రసంగాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. చూసుకో... కాచుకో... నీ రాజకీయ జిమ్మిక్కులు ఇక్కడ నడవవు... ఖబర్దార్ కేటీఆర్, అంటూ హెచ్చరించారు.